


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



గురువారం 01-01-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక :207 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## ఐబొమ్మ రవి కస్టడీ రిపోర్ట్..

### అత్యంత కీలకమైన మరో షాకింగ్ విషయం వెలుగులోకి



2 లో

## పులిహోర ప్రసాదంలో నత్త.. ఘటనపై రంగంలోకి ఇంటెలిజెన్స్ వర్గాలు..?



2 లో

## దాక్షారామంలో శివలింగం ధ్వంసం సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు



2 లో

## హాదీ హత్యతో నాకు ఎలాంటి సంబంధం లేదు..



2 లో

## పట్టెడన్నం పెట్టే కరువు పనిపై కుట్రలు చేశారు



2 లో

## కాల్పుల విరమణలో ఎవరి జోక్యం లేదు..

### చైనా వాదనను తోసిపుచ్చిన భారత్



2 లో

## ఫరీదాబాద్‌లో దారుణం..

### కదులుతున్న వ్యాన్‌లో మహిళపై గ్యాంగ్‌రేప్



2 లో

## హరీశ్‌రావు ఏదో లేఖ చూపించి దుష్ప్రచారం..మంత్రి ఉత్తమ్ కౌంటర్



2 లో

పోలవరం-నల్లమలసాగర్ ప్రి ఫీజిబులిటీ రిపోర్ట్ కు సీడబ్ల్యూసీ ఆమోదించిందంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. పోలవరం-నల్లమలసాగర్ ప్రి ఫీజిబులిటీ రిపోర్ట్ కు సీడబ్ల్యూసీ ఇంకా ఆమోదించలేదన్నారు. హరీశ్ రావు ఏదో లేఖ చూపించి దుష్ప్రచారం చేస్తున్నారని తెలంగాణ నీటి హక్కులను కాపాడుతున్నామన్నారు. ఓ న్యూస్ చానల్ తో మాట్లాడిన మంత్రి బనకచర్లను అడ్డుకునేందుకు కేంద్రానికి ఎన్నోసార్లు ఫిర్యాదు చేశామని తెలంగాణ నీటి హక్కులను ఏపీకి తాకట్టు పెట్టింది కేసీఆరేనన్నారు. జగన్‌తో చెట్టాపట్టాలేసుకుని తిరిగింది మీరు కాదా? రోజా ఇంటికి పోయి బేసిన్లు లేవు.. భేషజాలు లేవు అని కేసీఆర్ మాట్లాడారని గోదావరి, కృష్ణానీళ్లు ఆంధ్ర వాడుకుంటే తప్పేంటని కేసీఆర్ మాట్లాడలేదా? అని నిలదీశారు.




## 2026లో మూడో ప్రపంచ యుద్ధం, ఆర్థికమాంద్యం, ఇంకా ఎన్నో విపత్తులు.. వైరల్ అవుతున్న బాబా వంగా భవిష్యవాణి



2 లో

2026 నూతన సంవత్సర వేడుకలకు ప్రపంచమంత సిద్ధమవుతుండగా.. సోషల్ మీడియాలో బాబా వంగా చెప్పిన భవిష్యవాణి కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. బాల్కన్స్ నోస్ట్రాడమస్ అని పిలువబడే బాబా వంగా 2026 కొత్త సంవత్సరానికి సంబంధించిన అంచనాలపై నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. పుట్టుకతోనే అంధురాలైన బల్గేరియన్ మహిళ బాబా వంగా చెప్పిన భవిష్యవాణిపై ప్రపంచంలో చాలా మందికి బలమైన నమ్మకం ఉంది. 9/11 దాడుల నుంచి.. అమెరికాలో ఒబామా అధికారం చేపట్టం వరకూ, కోవిడ్ 19 సహా ప్రపంచ ప్రధాన సంఘటనలను ముందుగానే ఊహించారు. ప్రతీదీ చాలా కాలం క్రితమే బాబా వంగా ఊహించి చెప్పారని చెబుతారు. అయితే 2026కు సంబంధించి ఆమె చెప్పిన విషయాలు ఆందోళనకు గురిచేసేవిగా ఉన్నాయి.

బాబా వంగా జోస్యం ప్రకారం.. ప్రపంచంలోని తూర్పు భాగంలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరిగి యుద్ధంగా మారే అవకాశాలు ఉన్నాయి. ఈ యుద్ధం జ్వాలలు పాశ్చాత్య దేశాలకు చేరుకుని గణనీయమైన నష్టాలు కలుగుతాయి.

## తెలంగాణ సర్కార్ న్యూఇయర్ కానుక..

## బ్రేక్ ఫాస్ట్‌లో బిర్యానీ



2 లో

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం వచ్చే కొత్త సంవత్సరం నుంచి ఉదయం బ్రేక్ ఫాస్ట్ అందించనుంది. స్కూళ్లలో అడ్మిషన్లు పెంచేలా ఈ పథకాన్ని అమలు చేయాలని భావిస్తున్నది. అందులో భాగంగానే 2026-27 విద్యాసంవత్సరం నుంచి పాఠశాలల్లో అల్పహారం పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు పాఠశాల విద్యాశాఖ సన్నాహాలు చేస్తున్నది. పేద విద్యార్థులకు పోషకాహారం అందించడంతో పాటు స్కూళ్లలో హాజరుశాతాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. అందుకోసం సుమారు రూ. 400కోట్లు ఖర్చవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పథకం కింద వారంలో మూడు రోజులు అన్నంతో తయారుచేసే పులిహోర, వెజ్ బిర్యానీ, కిచిడీ వంటి వంటకాలను, మరో రెండు రోజులు ఉప్మా వంటి వాటిని అందించాలని అధికారులు ప్రతిపాదించారు. ప్రస్తుతం రాష్ట్రంలోని సుమారు 24వేల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 17లక్షల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం నిరంతరాయంగా అందుతోంది. తాజాగా దీనికి టిఫిన్ కూడా జత చేయడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడుతుందని, సుదూర ప్రాంతాల నుంచి స్కూళ్లకు వచ్చే విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

## కల్వకుంట్ల కవిత సంచలన నిర్ణయం.. కమ్యూనిస్టుల తరహాలో పోరాటానికి శ్రీకారం



2 లో

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ ఉద్యమకారులతో కలిసి భూ పోరాటానికి సిద్ధమయ్యారు. కరీంనగర్ జిల్లా మానకొండూరులో ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేయనున్నారు. గతంలో తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల చొప్పున ఇంటి స్థలం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది.

## బ్యాంకులో భారీ దోపిడీ.. రూ.316 కోట్లు అపహరణ



2 లో

ఓ బ్యాంకులో భారీ దోపిడీ జరిగింది. దుండగులు ఏకంగా రూ. 316 కోట్లకు పైగా సొత్తును ఎత్తుకుపోయారు. ఈ ఘటన జర్మనీలోని గెల్సెన్ కిర్చెన్ నగరంలో ఉన్న బ్యాంకులో జరిగింది. జర్మనీ నేర చరిత్రలోనే ఈ ఇది అతిపెద్ద దొంగతనమని అక్కడి అధికారులు పేర్కొన్నారు. ఈ దొంగతనంలో చాలామంది పాల్గొన్నట్లుగా అనుమానిస్తున్నారు. బ్యాంకులో ఉన్న 3200 సేఫ్టీ డిపాజిట్లను పగలగొట్టిన దుండగులు.. వాటిలో ఉన్న నగదు, బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. వీటి విలువ అక్కడి కరెన్సీలో 30 మిలియన్ యూరోలపైగా ఉంటుందని అంచనా వేశారు.

# ప్రపంచ ఆర్థిక శక్తిగా భారత్..

# జపాన్‌ను దాటేసి 4వ స్థానానికి



- ☑ జపాన్‌కు షాక్.. భారత్ 4వ అతిపెద్ద ఆర్థిక శక్తి
- ☑ 4.18 ట్రిలియన్ డాలర్లకు భారత జీడీపీ
- ☑ అమెరికా-చైనా తర్వాతి స్థానాలపై భారత్ దృష్టి
- ☑ 8.2% వృద్ధితో దూసుకెళ్తున్న దేశ ఆర్థిక వ్యవస్థ
- ☑ జర్మనీనే టార్గెట్.. 2030 నాటికి టాప్-3లో భారత్
- ☑ ప్రైవేట్ వినియోగం, సంస్కరణలే విజయానికి బలం
- ☑ భారత్ వృద్ధిపై వరల్డ్ బ్యాంక్, ఐఎంఎఫ్ ప్రశంసలు
- ☑ 2047 'వికసిత్ భారత్' లక్ష్యానికి బలమైన అడుగులు

మిగతా 2 లో

ప్రపంచ ఆర్థిక ముఖచిత్రంపై భారత్ సరికొత్త చరిత్ర సృష్టించింది. తన అద్భుతమైన వృద్ధి పథంతో జపాన్‌ను వెనక్కి నెట్టి.. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటన విడుదల చేస్తూ.. దేశ ఆర్థిక బలం 4.18 ట్రిలియన్ డాలర్లకు చేరుకుందని స్పష్టం చేసింది. ఇప్పటివరకు అమెరికా, చైనా, జర్మనీ తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. మరోవైపు.. మూడో స్థానంలో ఉన్న జర్మనీని వెనక్కి నెట్టేందుకు భారత్ ఉవ్విళ్లూరుతోంది.

Registered No : APTEL/25/A0818
ఇది కదా నిజం
గురువారం 01-01-2026

## కల్వకుంట్ల కవిత సంచలన నిర్ణయం.. కమ్యూనిస్టుల తరహాలో పోరాటానికి శ్రీకారం

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ ఉద్యమకారులతో కలిసి భూ పోరాటానికి సిద్ధమయ్యారు. కరీంనగర్ జిల్లా మానకొండూరులో ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేయనున్నారు. గతంలో తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల చొప్పున ఇంటి స్థలం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఇంటి స్థలాల హామీని డిసెంబర్ 9వ తేదీలోగా నెరవేర్చకుంటే భూ పోరాటాలకు చేస్తామని ఇదివరకే కవిత స్పష్టం చేసింది. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో కరీంనగర్ నుంచి భూ పోరాటానికి శ్రీకారం చుట్టింది. కమ్యూనిస్టు పార్టీల తరహాలో భూ పోరాటం ఆరంభించింది. ఉద్యమకారులకు ఇంటి స్థలాలు ఇచ్చే వరకు ఉద్యమం కొనసాగుతుందని.. అడ్డంకులు ఉద్యమం ఆగదని కవిత కీలక ప్రకటన చేశారు. కాగా, ఇప్పటికే కవిత 'జాగృతి జనంబాట యాత్ర' పేరుతో యాత్ర చేస్తున్నారు. అక్టోబరు 25వ తేదీన నిజామాబాద్‌లో జనంబాట ప్రారంభించిన విషయం తెలిసిందే.

## హరీశ్‌రావు ఏదో లేఖ చూపించి దుష్ప్రచారం..మంత్రి ఉత్తమ్ కౌంటర్

పోలవరం-నల్లమలసాగర్ ప్రి ఫీజిబులిటీ రిపోర్ట్ కు సీడబ్ల్యూసీ ఆమోదించిందంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. పోలవరం-నల్లమలసాగర్ ప్రి ఫీజిబులిటీ రిపోర్ట్ కు సీడబ్ల్యూసీ ఇంకా ఆమోదించలేదన్నారు. హరీశ్ రావు ఏదో లేఖ చూపించి దుష్ప్రచారం చేస్తున్నారని తెలంగాణ నీటి హక్కులను కాపాడుతున్నామన్నారు. ఓ న్యూస్ చానల్ తో మాట్లాడిన మంత్రి బనకచర్లను అడ్డుకునేందుకు కేంద్రానికి ఎన్నోసార్లు ఫిర్యాదు చేశామని తెలంగాణ నీటి హక్కులను ఏపీకి తాకట్టు పెట్టింది కేసీఆరేనన్నారు. జగన్‌తో చెట్టాపట్టాలేసుకుని తిరిగింది మీరు కాదా? రోజా ఇంటికి పోయి బేసిన్లు లేవు.. భేషజాలు లేవు అని కేసీఆర్ మాట్లాడారని గోదావరి, కృష్ణానీళ్లు ఆంధ్ర వాడుకుంటే తప్పేంటని కేసీఆర్ మాట్లాడలేదా? అని నిలదీశారు. బీఆర్ఎస్ హయాంలో సాగునీటి ప్రాజెక్టులను సర్వనాశనం చేశారని ఫైర్ అయ్యారు. పాలమూరుకు 45 టీఎంసీలకే ఒప్పుకున్నాం అన్నది అవాస్తవం అని సీడబ్ల్యూసీ అభ్యంతరాల కారణంగా మొదటి విడతలో 45 టీఎంసీలు అడిగామన్నారు. రెండో విడతలో 45 టీఎంసీలు ఇవ్వాలని లేఖ రాశామన్నారు. కాంగ్రెస్ ఐదేళ్ల పాలనలో సాగునీటి రంగంలో తెలంగాణ ముఖ చిత్రం మారుస్తామన్నారు.

హరీశ్ రావు ఏమన్నారు?:

మంగళవారం తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు.. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ అనుమతులు జారీ అయ్యాయని తెలంగాణ రాష్ట్ర అభిప్రాయం తీసుకోకుండానే సీడబ్ల్యూసీ అనుమతులు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం జరిగితే తెలంగాణకు తీవ్ర అన్యాయం... నీటి ప్రయోజనాలకు గండి పడుతుందని రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే అనుమతులు వచ్చాయన్నారు. ఇకనైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలని సూచించారు. తెలంగాణ జలదోపిడీకి ఆదిత్య నాథ్ దాస్ సూత్రధారి అని వెంటనే ఆయన్ను తొలగించాలని డిమాండ్ చేశారు. కత్తి ఆంధ్రా వాళ్ళదైతే పొడిచేది మాత్రం రేవంత్ రెడ్డి అని బనకచర్ల అనుమతులకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేస్తే బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందన్నారు. సీడబ్ల్యూసీ అనుమతుల రద్దు కోరుతూ ఢిల్లీలో ధర్నా చేద్దాం రావాలని ప్రభుత్వానికి హరీశ్ రావు పిలుపునిచ్చారు.

## ఐబొమ్మ రవి కస్టడీ రిపోర్ట్.. అత్యంత కీలకమైన మరో షాకింగ్ విషయం వెలుగులోకి

ఐబొమ్మ రవి కస్టడీ రిపోర్ట్ వెలుగులోకి వచ్చింది. 12 రోజుల కస్టడీలో రవి కీలక అంశాలు రివీల్ చేశారు. సినిమాలను రెండు రకాలుగా కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు. క్యామ్ కార్డర్ ప్రింట్‌కు ఒక ధర, హెడ్‌డీ ప్రింట్‌కు మరో ధర చెల్లించినట్లు వెల్లడించారు. ఒక్కో క్యామ్ కార్డర్ ప్రింట్ సినిమాకు రూ.100 డాలర్లు, హెడ్‌డీ ప్రింట్ సినిమాకు రూ.200 డాలర్లు చెల్లించినట్లు తెలిపారు. మొత్తం రవి బ్యాంక్ ఖాతాలకు రూ.13.40 కోట్లు వచ్చినట్లు గుర్తించారు. ఇందులో బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ ద్వారా రూ.1.58 కోట్లు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ డబ్బులో నుంచి రవి సోదరి చంద్రికకు రూ.90 లక్షల వరకు పంపించారు. లావాదేవీలన్నీ డాలర్ల రూపంలోనే చెల్లించారు. కొంతకాలం కూకట్‌పల్లి నుంచి వ్యవహారం నడిపిన రవి.. డబ్బులు అధికంగా రావడంతో జల్సాల కోసం ఇతర దేశాలకు వెళ్లినట్లు పోలీసులు నిర్ధారించారు. ఒక్కో కేసులో నాలుగు రోజుల చొప్పున.. మూడు కేసుల్లో 12 రోజులపాటు పోలీసులు ఐబొమ్మ రవిని పోలీసులు విచారించారు.

విచారణ సందర్భంగా రవి మీడియాతో మాట్లాడుతూ.. తన మీద పెట్టిన కేసులన్నీ ఫాల్స్ అన్నారు. ఏదైనా కోర్టులోనే తేల్చుకుంటానంటూ తెలిపారు. సరైన సమయంలో వాస్తవాలు బయటపెడతానంటూ కోర్టు ఆవరణలో పేర్కొన్నాడు.

## తెలంగాణ సర్కార్ న్యూఇయర్ కానుక.. బ్రేక్ ఫాస్ట్‌లో బిర్యానీ

మొదటి పేజీ తరువాయి

కేజీబీవీల అప్‌గ్రేడేషన్‌కు కసరత్తు

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలను(కేజీబీవీ) బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. ప్రస్తుతం 10వ తరగతి వరకు ఉన్న కేజీబీవీలను ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేసేందుకు విద్యాశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నది. తద్వారా 10వ తరగతి తర్వాత గ్రామీణ ప్రాంత విద్యార్థినులు చదువు మధ్యలో ఆపివేయకుండా, అదే ప్రాంగణంలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవకాశం కలుగుతుంది. రాష్ట్రంలో మొత్తం495 కేజీబీవీ ఉండగా, 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం సుమారు 120 కేజీబీవీలను ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నది. వచ్చే ఏడాదికి పూర్తిస్థాయిలో కేజీబీవీలు అప్ గ్రేడ్ చేసేందుకు సమాయత్తమవుతోంది.

జూనియర్ కాలేజీల్లోనూ మిడ్ డే మీల్స్

పాఠశాల విద్యార్థులకే పరిమితమైన మధ్యాహ్న భోజన పథకాన్ని ఇకపై ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు కూడా విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 430 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న సుమారు 1.7 లక్షల మంది ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే విషయంపై ఇంటర్ బోర్డు కసరత్తు చేస్తున్నది. అలాగే యూనిఫామ్స్ అందించే విషయంపై కూడా ఇంటర్ బోర్డు ఆలోచనలు చేస్తోంది.

## సింహాచలం పులిహోర ప్రసాదంలో నత్త.. ఘటనపై రంగంలోకి ఇంటెలిజెన్స్ వర్గాలు..?

విశాఖ జిల్లా సింహాచలం అప్పన్నస్వామి పులిహోర ప్రసాదం లో నత్త వచ్చిందని సోషల్ మీడియాలో గాజువాక భక్తులు పెట్టిన పోస్ట్ తీవ్ర దుమారం రేపింది. ఈ నెల 29న తాము అప్పన్నను దర్శించుకుని ప్రసాదం కొనుగోలు చేశామని, అయితే నత్త కనిపించిందని పోస్టులో తెలిపారు. ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని, అందువల్లే సోషల్ మీడియాలో వీడియో పోస్ట్ చేశామని తెలిపారు. దీంతో ఈ ఘటనపై దేవాదాయ శాఖ సీరియస్ అయింది. తక్షణమే విచారణ జరిపి నిజానిజాలపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. పులిహోర ప్రసాదంలో నత్త ఉండటం ఆరోపణలు మాత్రమేనని ఈవో సుజాత పేర్కొన్నారు. ఘటపై పూర్తి విచారణ జరిపి నివేదిక అందజేస్తామని ఆమె వెల్లడించారు.

మరోవైపు నత్త ఘటనపై వైసీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తుల మనోభావాలను ప్రభుత్వం దెబ్బతీస్తోందని ఆ పార్టీ నేతలు విమర్శించారు. నత్త వ్యవహారంలో ఆరోపణలు చేసిన భక్తులను విచారించాలని దేవస్థానం నిర్ణయించింది. దీంతో ఈ ఘటనపై ఇంటెలిజెన్స్ వర్గాలు రంగంలోకి దిగాయి. పులిహోర ప్రసాదంలోకి నత్త ఎలా వచ్చిందనే అంశంపై ఆరా తీస్తున్నారు

## తెలంగాణ రైతులకు భారీ శుభవార్త.. వ్యవసాయ శాఖ సూపర్ ప్లాన్

ప్రభుత్వం నూతన సంవత్సరం కానుకగా అందజేస్తే ఈ రబీ సీజన్‌లో ఇతర రాష్ట్రాల నుంచి కూలీల కష్టపడి తీసుకురావాల్సిన పరిస్థితి ఉండదు. తక్కువ కూలీలు అవసరం ఉండటంతో స్థానికంగా కూలీలతో పనులు పూర్తి చేయవచ్చు. 8 సంవత్సరాల క్రితం కేసీఆర్ ప్రభుత్వం యాంత్రీకరణ పథకం రద్దు చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత యాంత్రీకరణ పథకం పునరుద్ధరణ నిర్ణయం తీసుకుంది. యువత ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా వ్యవసాయం వైపు అడుగులు వేసేలా చేస్తుంది. మండల వ్యవసాయ అధికారులు తమ పరిధిలోని రైతులకు అవగాహన చేసిన పరికరాలు తీసుకోవాలని ప్రచారం చేపట్టారు. దీంతో రెండు ఎకరాలపై ఉన్న అన్నదాతలంతా యంత్ర పరికరాలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. కొందరు తమకు యంత్రాలు ఇప్పించాలని స్థానిక ఎమ్మెల్యేలను కోరుతున్నారు.

యాంత్రీకరణతో రైతులకు ఆదాయం :

సాగులో పెట్టుబడి ఖర్చులను తగ్గించి రైతుల ఆదాయం పెరిగేందుకు యంత్రాల అందజేత పథకానికి రైతుల నుంచి ఆదరణ లభిస్తుంది. ప్రభుత్వం రాయితీపై అందించే వ్యవసాయ పనిముట్లు రైతులకు ఎంతో ఉపయోగంగా ఉండటంతో పాటు సాగులో కూలీల కొరతను అధిగమించవచ్చు. ఈ రాయితీ పథకానికి ఐదెకరాల్లోపు భూమి ఉన్న రైతులు అర్హులు. ఈ పథకం కింద విత్తనాలు చల్లే యంత్రాలు, కోతకోసే యంత్రాలు, స్ప్రేయర్లు, ట్రాక్టర్లతో నడిచే రోటోవేటర్లు, ప్లౌ, ట్రాలీ, సీడర్, కలుపు తీసే యంత్రాలు, పవర్ ట్రిల్లర్లు, స్ట్రాబాలర్లు, బండ్ ఫార్మర్ వంటి 15 రకాల యంత్రాలకు రాయితీ ఇస్తోంది.

లబ్దిదారుల గుర్తింపుకు కమిటీలు :

సబ్సిడీ యంత్రాలను అందించేందుకు అర్హులైన రైతులను ఎంపిక చేసేందుకు త్వరలో కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. మండల స్థాయి కమిటీలో వ్యవసాయ అధికారి, తహశీల్దార్, ఎంపీడీవో ఉంటారు. సబ్సిడీ రూ. లక్ష దాటితే జిల్లా కమిటీ అనుమతి తప్పనిసరి. జిల్లాస్థాయి కమిటీలో కలెక్టర్ చైర్మన్‌గా, కన్వీనర్‌గా డీఏవో, ఆగ్రోస్ ఆర్ఎం, ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త, లీడ్ బ్యాంక్ ఆఫీసర్ సభ్యులుగా ఉంటారు. లబ్దిదారుల ఎంపికలో రాజకీయ పైరవీలకు తావులేకుండా పథకం అమలు చేస్తారు.

## 2026లో మూడో ప్రపంచ యుద్ధం, ఆర్థికమాంద్యం, ఇంకా ఎన్నో విపత్తులు.. వైరల్ అవుతున్న బాబా వంగా భవిష్యవాణి

మొదటి పేజీ తరువాయి

ముఖ్యంగా అమెరికా, రష్యా , చైనా వంటి ప్రధాన శక్తులతో కూడిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరిగే అవకాశం ఉందని ఆమె హెచ్చరించినట్లు నివేదికలు సూచిస్తున్నాయి. ఈ వివాదం ప్రపంచ శక్తి సమతుల్యతను పూర్తిగా మార్చేదిగా ఉంటుంది. ఆ సమయంలో రష్యన్ నాయకుడు దానిని నియంత్రించగలడు.

అలాగే 2026లో ప్రపంచం కొన్ని తీవ్రమైన ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవచ్చని వంగా భవిష్యవాణి చెబుతోంది. వంగ సూచనల ప్రకారం.. పర్యావరణ సంక్షోభాలు, వాతావరణ మార్పులు, భారీ వర్షాలు కారణంగా వరదలు, కరువులు సంభవిస్తాయి. అగ్నిపర్వతాల విస్ఫోటనాలు పెరుగుతాయి. పెరుగుతున్న ప్రపంచ ఉష్ణోగ్రతలు.. వరదలు, కార్చిచ్చులు, దుర్బల ప్రాంతాల్లో భూకంపాలకు దారి తీస్తాయని శాస్త్రవేత్తలు కూడా అంచనా వేశారు.

ఏఐ డామినేషన్

ఇప్పటికే ఏఐ..హ్యూమన్ ను డామినేట్ చేస్తోంది. మున్ముందు ఇది మానవులకు అందని నిర్ణయాలను తీసుకుని, దైనందిన కార్యకలాపాలను కూడా ప్రభావితం చేస్తుందని, ఈ పరిస్థితి మనుషులు నిర్వహించలేని విధంగా ఉంటుందని, ఇది భవిష్యత్తుకు ముఖ్యమైన సవాలుగా మారుతుందని బాబా వంగా భవిష్యవాణిలో చెప్పారు. చైనా వంటి దేశం 2026లో బలపడే సంకేతాలు కనిపిస్తున్నాయి. తైవాన్, సౌత్ చైనా కొన్ని సవాళ్లను ఎదుర్కొంటాయి. రష్యాలో కొత్త నాయకుడు అధికారంలోకి వచ్చే అవకాశాలున్నాయి. అతనికి యుద్ధం, రాజకీయ గందరగోళం కారణంగా గణనీయమైన గుర్తింపు లభించనుందని బాబా వంగా ఊహించారు. అంతేకాదు తీవ్రమైన ఆర్థిక మాంద్యం వస్తుందని ముందే ఊహించినట్లు తెలుస్తోంది.

గ్రహాంతర జీవులతో పరిచయం?

2026లో గ్రహాంతర జీవులతో తొలి పరిచయం ఏర్పడవచ్చని అంచనాలున్నాయి. మానవాళి గ్రహాంతర జీవులను ఎదుర్కోవచ్చని, ఖగోళ శాస్త్రవేత్తలు జూలై 2025 లో చిలీలోని అట్లాస్ టెలిస్కోప్ ద్వారా కనుగొనబడిన ఒక నక్షత్రాంతర వస్తువు 3I/అట్లాస్ ను గుర్తించిన తర్వాత ఈ సిద్ధాంతం ప్రజాదరణ పొందింది. 3I/అట్లాస్ ..హైపర్బోలిక్ పథాన్ని అనుసరిస్తుంది, ఇది మన సౌర వ్యవస్థ వెలుపల ఉద్భవించిందని నిర్ధారిస్తుంది. శాస్త్రవేత్తలు దీనిని కృత్రిమంగా కాకుండా సహజ ఇంటర్స్టెల్లార్ వస్తువుగా కూడా వర్గీకరించారు.

## బ్యాంకులో భారీ దోపిడీ.. రూ.316 కోట్లు అపహరణ

మొదటి పేజీ తరువాయి

దుండగులు పార్కింగ గ్యారేజీ నుంచి లోపలికి ప్రవేశించి.. ఖజానా ఉన్న గది గోడకు భారీ రంధ్రం చేసి వెళ్లినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. 2500 మంది ఖాతాదారులకు చెందిన సొమ్ము దోపిడీకి గురైనట్లు సమచారం. విషయం తెలుసుకున్న వందలాదిమంది కస్టమర్లు బ్యాంకు వద్దకు చేరుకుని తమ సొమ్మును తెచ్చివ్వాలని ఆందోళనకు దిగారు. పలువురు కస్టమర్లు బ్యాంకు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా.. భద్రతా దళాలు వారిని అడ్డుకున్నాయి.

## పట్టెడన్నం పెట్టే కరువు పనిపై కుట్రలు చేశారు



MGNREGA పథకం పేరును కేంద్ర ప్రభుత్వం ఇటీవల మార్పు చేసింది. పేరు మార్పును ఏఐసీసీ నాయకత్వం వ్యతిరేకిస్తోంది. ఈ క్రమంలో ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైయస్ షర్మిలా కూడా పేరు మార్పుపై స్పందించారు. మహాత్మా గాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయ్మెంట్ గ్యారంటీ స్కీం (MGNREGA) ను వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్ గ్రామీన్ యాక్ట్ – 2025 (వీబీ జి రామ్ జి)గా మార్చడాన్ని తప్పుబట్టారు. పట్టెడన్నం పెట్టే కరువు పనిపై కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేసిందని ఆరోపించారు. చట్టాన్ని మార్చి ఉపాధి హామీలోని ఊపిరి తీశారన్నారు. కొత్త చటంలో ఉపాధి లేదని విమర్శించారు. కాంగ్రెస్ అమలు చేసిన MGNREGA, బిజెపి తెచ్చిన వీబీ జి రామ్ జి  కి మధ్య నక్కకి నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని ఎద్దేవా చేశారు. దానికి ఒక నల్ల చట్టంగా అభివర్ణించారు. రాష్ట్రాల మీద ఆర్థిక భారం మోపి, గ్రామ స్వరాజ్యం వినాశనం చేసే దిశగా కేంద్ర ఈ కొత్త చట్టం తెచ్చిందన్నారు.

నూతన పథకంలో పనులను గ్రామసభ కాకుండా దిల్లీ పెద్దలు నిర్ణయిస్తారని.. అది ప్రజల పని హక్కును కాలరాస్తుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇటువంటి చట్టాన్ని తామెప్పుడూ చూడలేదన్నారు. అన్ని గ్రామాల్లో కాకుండా కేవలం ఎంపిక చేసిన గ్రామాల్లోనే పనులు కల్పిస్తారా అని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో జాతీయ ఉపాధి హామీ పథకానికి బీజం పడిందన్నారు. ఆయన ఒత్తిడితో 2006లో ఉపాధికి శ్రీకారం చుట్టింది తొలుత ఏపీలోనే అని గుర్తు చేశారు. పనికి ఆహారం పథకం అమలులో వైయస్ఆర్ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కరువు పని విజయవంతంలో ఏపీ రోల్ మోడల్ అయ్యిందన్నారు. బ్రతుకుకు గ్యారంటీ ఇచ్చి, వలసలు నివారించి, పేదల కొనుగోలు శక్తిని పెంచిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నేడు నీరుగారి పోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు.

MGNREGA కు ఏపీ పుట్టినిల్లు అని స్పష్టం చేశారు. ఏఐసీసీ పిలుపు మేరకు, మాజీ ముఖ్యమంత్రి ఆశయ సాధనను కాపాడేందుకు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసనలను చేపడతామని ప్రకటించారు. కలిసి వచ్చే పార్టీలు, ప్రజా సంఘాలు, రైతు సంఘాలను కలుపుకొని అన్ని జిల్లాలో ఉద్యమిస్తామన్నారు. నూతన చట్టాన్ని వెనక్కు తీసుకొని మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని తిరిగి అమలుపరచాలని డిమాండ్ చేశారు.

## హాదీ హత్యతో నాకు ఎలాంటి సంబంధం లేదు..

బంగ్లాదేశ్ విద్యార్థి నేత హాదీ హత్య కేసులో ప్రధాన అనుమానితుడిగా ఉన్న ఫైసల్ కరీం మసూద్ సెల్ఫీ వీడియో విడుదల చేశాడు. తాను ప్రస్తుతం దుబాయ్ లో ఉన్నానని హాదీ హత్యతో తనకు ఎలాంటతి సంబంధం లేదని వెల్లడించాడు. అంతే కాకుండా మాజాత్ షిబర్ ఈ హత్య చేశాడని ఆరోపించాడు. హాదీతో తన సంబంధాలు కేవలం వ్యాపార సంబంధమైనవి అని చెప్పాడు. హాదీ జమాత్ కు చెందినవాడని జమాతీలే ఈ హత్య వెనుక ఉండవచ్చని ఆరోపించాడు. తాను ఓ ఐటీ కంపెనీ అధినేత వద్ద పనిచేస్తున్నానని ప్రభుత్వ కాంట్రాక్టులకు సంబంధించి పొలిటికల్ డొనేషన్స్ కోసమే హాదీని కలిసినట్టు చెప్పాడు. ఇదిలా ఉంటే బంగ్లాదేశ్ పోలీసులు మసూద్ మరియు అలాంగిర్ షెయిక్ హాదీ హత్య తరవాత బంగ్లాదేశ్ పారిపోయారని చెప్పారు. వాళ్లు హలాగట్ బార్డర్ ద్వారా ఇండియాకు పారిపోయారని అన్నారు. భారత అధికారులు బంగ్లాదేశ్ పోలీసులు చేసిన ఋూరోపణలను ఖండించారు. ఇక హాదీని డిసెంబర్ 12న దాకాలోని పల్టాన్ ప్రాంతంలో దుండగులు కాల్చి చంపారు. పొలిటికల్ ప్రచార సభలో ఉన్న అతడిపై కాల్పులు జరపగా తీవ్రంగా గాయపడి సింగపూర్ ఆస్పత్రిలో మరణించాడు. దీంతో బంగ్లాదేశ్ లో అల్లర్లు చెలరేగాయి. ఇప్పటికీ ప్రజల ఆగ్రహ జ్వాలలు ఆరడంలేదు.

## ప్రపంచ ఆర్థిక శక్తిగా భారత్.. జపాన్‌ను దాటేసి 4వ స్థానానికి

మొదటి పేజీ తరువాయి

ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అమెరికా అగ్ర స్థానంలో కొనసాగుతోంది. రెండో స్థానంలో చైనా ఉంది. తాజాగా జపాన్‌ను అధిగమించిన భారత్ నాలుగో స్థానానికి చేరుకుని.. ఇక మూడో స్థానంలో ఉన్న జర్మనీకి గట్టి పోటీనిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో భారత్ 8.2 శాతం అద్భుతమైన వృద్ధిని సాధించింది. అంతర్జాతీయంగా వాణిజ్య అనిశ్చితులు ఉన్నప్పటికీ.. దేశీయంగా ప్రైవేట్ వినియోగం భారీగా పెరగడం, పటిష్టమైన ఆర్థిక సంస్కరణల వల్ల ఈ విజయం సాధ్యమైందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.ఇదే వేగాన్ని కొనసాగిస్తే.. రాబోయే 2.5 నుంచి 3 ఏళ్లలోనే జర్మనీని వెనక్కి నెట్టి.. 2030 నాటికి 7.3 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా అవతరించడం ఖాయమని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. అంతర్జాతీయ సంస్థలైన వరల్డ్ బ్యాంక్, ఐఎంఎఫ్, మూడీస్ కూడా భారత ఆర్థిక వృద్ధిపై ప్రశంసలు కురిపించాయి. ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉండటం, నిరుద్యోగిత శాతం తగ్గడం, ఎగుమతులు భారీగా పెరగడం వంటి అంశాలు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచాయి. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంతో.. దేశ స్వాతంత్ర్య శతాబ్ది వేడుకల నాటికి ఎగువ మధ్య ఆదాయ దేశంగా ఎదగాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలో బలమైన నిర్మాణాత్మక సంస్కరణలు, సామాజిక పురోగతి దిశగా భారత్ అడుగులు వేస్తోంది.

## కాల్పుల విరమణలో ఎవరి జోక్యం లేదు.. చైనా వాదనను తోసిపుచ్చిన భారత్

భారత్-పాకిస్థాన్ యుద్ధం విరమణ విషయంలో మూడో వ్యక్తి ప్రమేయం లేదని భారతదేశం మరోసారి తేల్చి చెప్పింది. తాజాగా చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి మాట్లాడుతూ.. భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణకు ట్రంప్‌తో పాటు చైనా కూడా కృషి చేసిందని వ్యాఖ్యానించారు. తాజాగా చైనా ప్రకటనను భారత విదేశాంగ శాఖ తోసిపుచ్చింది. పాక్‌తో కాల్పుల విరమణ విషయంలో ఎవరి జోక్యం లేదని స్పష్టం చేసింది. ఇరు దేశాల సైనిక డీజీఎంవోలు చర్చలు జరిపి నిర్ణయం తీసుకున్నారని.. ఇందులో మూడో పక్షం పాత్ర లేదని స్పష్టం చేసింది. పాకిస్థాన్‌తో కాల్పుల విరమణపై ఇప్పటికే పలు సందర్భాల్లో తమ వైఖరిని స్పష్టం చేసినట్లు పేర్కొంది. ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది చనిపోయారు. అనంతరం మే 7న ప్రతీకారంగా పాకిస్థాన్‌పై భారతదేశం ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. నాలుగు రోజుల తర్వాత మే 10న ఇరు దేశాల చర్చలతో కాల్పుల విరమణ జరిగింది. అయితే ఈ క్రెడిట్‌ను ట్రంప్ కొట్టేసే ప్రయత్నం చేశారు. ఇరు దేశాలను వాణిజ్య హెచ్చరికలతో బెదిరించడంతో కాల్పుల విరమణకు అంగీకరించాయని ప్రకటించారు. అయితే ట్రంప్ వాదనను భారతదేశం తీవ్రంగా ఖండించింది. కాల్పుల విరమణ విషయంలో మూడో వ్యక్తి ప్రమేయం లేదని తేల్చి చెప్పింది. అయినా కూడా ట్రంప్ ఏ మాత్రం తగ్గలేదు. ఎక్కడికెళ్లినా.. ఏ నేతతో భేటీ అయినా ప్రపంచ వ్యాప్తంగా భారత్-పాకిస్థాన్ యుద్ధంతో పాటు ఎనిమిది యుద్ధాలు ఆపినట్లుగా చెప్పుకుంటూ వచ్చారు. ఇంకోవైపు భారత్ నిరంతరం ఖండిస్తూనే ఉంది. అయినా కూడా ట్రంప్ వెనక్కి తగ్గలేదు. తాజాగా ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో భేటీ అయినప్పుడు కూడా అదే విషయాన్ని ప్రస్తావించారు. ఇలా ఇప్పటి వరకు 70 సార్లు ఆ విషయాన్ని ట్రంప్ గుర్తుచేశారు. తాజాగా ఈ జాబితాలో చైనా కూడా చేరింది. భారత్-పాకిస్థాన్ ఉద్రిక్తతలను తగ్గించడంలో ట్రంప్‌తో పాటు చైనా కూడా కృషి చేసిందని మంగళవారం విదేశాంగ మంత్రి వాంగ్ యి ప్రకటించారు. భారత్-పాకిస్థాన్‌తో పాటు ఉత్తర మయన్మార్ ఉద్రిక్తతలు, కంబోడియా-థాయ్‌లాండ్, ఇజ్రాయెల్-పాలస్తీనా ఉద్రిక్తతలు, ఇరాన్ అణు సమస్యతో పాటు ప్రపంచ సంఘర్షణలకు బీజింగ్ శాంతికర్తగా వ్యవహరించిందని చెప్పుకొచ్చారు. ఇక ఆగస్టులో టియాంజిన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ హాజరు తర్వాత భారత్‌తో మంచి సంబంధాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మొత్తానికి చైనా వాదనను భారత్ తోసిపుచ్చింది.

## ఫరీదాబాద్‌లో దారుణం.. కదులుతున్న వ్యాన్‌లో మహిళపై గ్యాంగ్‌రేప్

ఎన్ని కఠిన చట్టాలొచ్చినా మృగాళ్లలో మార్పు రావడం లేదు. కామంతో కళ్లు మూసుకుపోయిన కామాంధులు అఘాయిత్యాలకు తెగబడుతున్నారు. తాజాగా హర్యానాలోని ఫరీదాబాద్‌లో దారుణం జరిగింది. మంగళవారం తెల్లవారుజామున 28 ఏళ్ల మహిళపై కదులుతున్న వ్యాన్‌లో రెండున్నర గంటల పాటు ఇద్దరు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం రోడ్డుపై విసిరేసి పరారయ్యారు. ఈ ఘటన సంచలనం సృష్టిస్తోంది. సోమవారం-మంగళవారం మధ్య రాత్రిలో వివాహిత ఇంటికి వెళ్లేందుకు వాహనం కోసం ఎదురుచూస్తోంది. ఆ సమయంలో ఒక వ్యాన్ వచ్చింది. ఇంటి దగ్గర దింపుతామని నమ్మించి ఇద్దరు యువకులు వ్యాన్ ఎక్కించుకున్నారు. అయితే వెళ్లాల్సిన మార్గంలో కాకుండా వాహనం గుర్గావ్ రోడ్డు వైపు వెళ్లింది. అనంతరం ఆమెను బెదిరించి ఒకరి తర్వాత ఒకరు అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆమె తీవ్రంగా ప్రతిఘటించినా నిందితులు మాత్రం ఆగలేదు. బెదిరించి మరీ అత్యాచారం చేశారు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఎస్‌జీఎం నగర్‌లోని రాజా చౌక్ సమీపంలో మహిళను బయటకు విసిరివేసి పరాయ్యారు. దీంతో బాధితురాలి ముఖంపై తీవ్ర గాయాలు అయ్యాయి. తీవ్ర రక్తస్రావం అయింది. వెంటనే సోదరికి పదే పదే ఫోన్ చేశాక స్పందించింది. సంఘటనాస్థలికి చేరుకోగానే పరిస్థితి విషమంగా ఉండటంతో ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ముఖానికి 10-12 కుట్లు వేశారు. ప్రస్తుతం బాధితురాలు షాక్‌లో ఉందని.. స్టేట్‌మెంట్ ఇంకా నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు. బాధితురాలి సోదరి తన ఫిర్యాదులో.. అత్యాచారం జరగడానికి ఒక రోజు ముందు రాత్రి 8.30 గంటల ప్రాంతంలో తనకు ఫోన్ చేసి తల్లితో గొడవ పడినట్లు చెప్పిందని తెలిపింది. స్నేహితురాలి ఇంటికి వెళ్తున్నానని.. తాను మూడు గంటల్లో ఇంటికి తిరిగి వస్తానని చెప్పినట్లుగా పేర్కొంది. తన సోదరికి ముగ్గురు పిల్లలు ఉన్నారని.. భర్తతో వివాదం కారణంగా విడివిడిగా ఉంటున్నారని వెల్లడించింది. ఇక పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

### ద్రాక్షారామంలో శివలింగం ధ్వంసం సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో కపాలేశ్వర స్వామి శివలింగాన్ని ధ్వంసం చేసిన ఘటన సంచలనంగా మారింది.. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని.. ఆరు పోలీసు బృందాలతో నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్టు పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు.. సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా అనుమానితులను అదుపులో తీసుకుని విచారిస్తున్నారు పోలీసులు.. అయితే, శివలింగాన్ని ధ్వంసం చేయడంపై స్పందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.. శివలింగం ధ్వంసం ఘటనపై తాను జిల్లా ఎస్పీ, కలెక్టర్ తో పాటు జిల్లా మంత్రితో మాట్లాడినట్లు మంత్రి ఆనం చెప్పారు.. నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.. అయితే, ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆదేశాలు జారీ చేశారు సీఎం చంద్రబాబు ఘటనపై జరుగుతున్న దర్యాప్తు వివరాలను తనకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.. ధ్వంసమైవ శివలింగం స్థానంలో నూతన శివలింగం పునఃప్రతిష్ఠ చేసినట్టు సీఎంకు వివరించారు మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి.. వేదపండితులు, అర్చకులతో శాస్త్రోక్తంగా పునః ప్రతిష్ట చేపట్టినట్టు మంత్రి ఆనం వెల్లడించారు.. దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో కార్యక్రమం నిర్వహించినట్టు సీఎం చంద్రబాబుకు వివరించారు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అయితే, ద్రాక్షారామ శివలింగం ధ్వంసంఘటనపై విచారణ వేగవంతం చేశారు పోలీసులు.. తోటపేట గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు..

# భూభారతి, రెవెన్యూ సదస్సు దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

## యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



ఇది కద నిజం, ఆత్మకూరు: ఎన్నికల SIR, భూభారతి, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి పెండింగ్ లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆత్మకూరు మండల తహసిల్దార్ కార్యాలయంలో భూభారతి, రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత తహసిల్దార్‌తో మాట్లాడుతూ, ప్రస్తుతం SIR సంబంధించి కుటుంబ సభ్యుల పేర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. భూభారతి, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ పరిశీలించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు, సలహాలు అధికారులకు తెలిపారు. భూభారతి, రెవెన్యూ సదస్సు దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అన్ని దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా డిస్పోజ్ చేసి పెండింగ్ లేకుండా చూడాలన్నారు. అన్ని మాడ్యూల్స్‌లో దాఖలైన భూభారతి దరఖాస్తులను ఎక్కడా పెండింగ్ ఉంచకుండా వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూభారతి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను మండల తహసిల్దార్ లాగిన్‌లో ఉన్నవాటిని ప్రాధాన్యతతో పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా దరఖాస్తులను క్షేత్రస్థాయిలో సమగ్రంగా విచారణ చేయాలని, రెవెన్యూ పరంగా ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీమతి లావణ్య, గిర్ధవర్ మల్లికార్జున్ రావు, వెంకటేశ్వర్లు, జీపీఓ శ్రీనివాస్ చారి, రాజయ్య, సత్యనారాయణ, నర్సింహా, వీరాస్వామి, దాసరి వీరయ్య, కంప్యూటర్ ఆపరేటర్లు రమేష్, రవి తదితర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# రాజాపేట మండల పరిషద్ కార్యాలయం వద్ద TASCA క్యాలెండర్ ఆవిష్కరణ




ఇది కద నిజం, రాజాపేట: డిసెంబర్ 31, 2026న రాజాపేట మండల పరిషద్ కార్యాలయం వద్ద తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ (TASCA) ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్లు మరియు పిలుపు పత్రికలను సోమారం, లక్ష్మక్కపల్లి, కొత్త జాల గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ అధికారి కిషన్ మాట్లాడుతూ, సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. అసోసియేషన్ కార్యక్రమాలకు అన్ని విధాలా సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలీల్ , సంబంధిత పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అలాగే తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నుండి భోగ జ్ఞానేందర్ (కోశాధికారి)తో పాటు అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సీనియర్ సిటిజన్ల హక్కులు, సంక్షేమంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ క్యాలెండర్లు, పిలుపు పత్రికల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడినట్లు నిర్వాహకులు తెలిపారు.

# విదేశీ వ్యామోహం వద్దు.. ఉగాదినే నూతన సంవత్సరం చేయాలి!

## విదేశీ వ్యామోహంలో యువత చెడిపోవద్దు: బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గౌడిచర్ల వెంకటేష్



ఇది కద నిజం, చేవెళ్ల: విదేశీ వ్యామోహంలో పడి యువత చెడిపోవద్దని, మన దేశ సంస్కృతిసంప్రదాయాలకు ప్రతీక అయిన ఉగాది పండుగను నూతన సంవత్సరంగా జరుపుకోవాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గౌడిచర్ల వెంకటేష్ పిలుపునిచ్చారు. బుధవారం చేవెళ్లలో విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, శాస్త్రీయత, విజ్ఞానపరమైన ఆలోచనలు, సనాతన విలువలతో కూడిన భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలని సూచించారు. విదేశీ పద్ధతులకు ఆకర్షితులై, అశాస్త్రీయతకు ఆధారమైన అలవాట్ల వైపు యువత వెళ్లడం ఆందోళనకరమని అన్నారు. ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా డిసెంబర్ 31న యువత పబ్బులు, ఫాం హౌసుల్లో అర్ధరాత్రి వరకు మద్యం మత్తులో మునిగి తేలుతూ ఇతర చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారని విమర్శించారు. దీని వల్ల తల్లిదండ్రులకు చెడ్డ పేరు తెచ్చే పరిస్థితులు ఏర్పడుతున్నాయని, అలాగే రోడ్డు ప్రమాదాలకు గురై తీరని వేదనను కుటుంబాలకు మిగుల్చుతున్నారని పేర్కొన్నారు. మనది కాని ఈ విదేశీ సంస్కృతి మన ప్రాణాల మీదికే ప్రమాదంగా మారుతోందని, దీనిని వీడి మన సంప్రదాయాల వైపు యువత మళ్లాలని ఆయన సూచించారు. ప్రకృతి సహజంగా, వైజ్ఞానికంగా మానవాభివృద్ధికి ఆధారంగా ఉన్న మన ఉగాది పండుగను నూతన సంవత్సరంగా జరుపుకోవడం ద్వారా సంస్కృతి పరిరక్షణ సాధ్యమవుతుందని గౌడిచర్ల వెంకటేష్ తెలిపారు.

# చిట్టిగిద్ద గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

## పశువుల తాగునీటి శుద్ధి బోరు బావిలో మోటార్ ఏర్పాటుకు చర్యలు



ఇది కద నిజం, చిట్టిగిద్ద: నవాబుపేట మండల పరిధిలోని చిట్టిగిద్ద గ్రామంలో గ్రామాభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. గ్రామ సర్పంచ్ పోతురాజు శ్రీధర్ రావు, వార్డు మెంబర్ సెక్రటరీతో పాటు గ్రామ ప్రజలు సమిష్టిగా పాల్గొని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మాటకు కట్టుబడిన నాయకుడిగా పేరుగాంచిన శ్రీధర్ రావు , ఇచ్చిన హామీ మేరకు గ్రామంలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఒకటో వార్డులో పశువులు తాగేందుకు ఉపయోగించే నీటి గుంతను పూర్తిగా శుభ్రపరచి, అందులో ఉన్న చెత్త, అనవసర వస్తువులను తొలగించారు. దీని ద్వారా పశువులకు పరిశుభ్రమైన తాగునీరు అందుబాటులోకి వచ్చింది. అదేవిధంగా, పశువుల నీటి గుంత పక్కనే ఉన్న బోరు బావిలో ప్రస్తుతం మోటార్ లేకపోవడంతో, గ్రామస్తులు మరియు గ్రామ పెద్దలు అందరూ కలిసి బోరు బావిలో మోటార్ ఏర్పాటు చేయాలని గ్రామ సర్పంచ్ పోతురాజు శ్రీధర్ రావుని కోరారు. దీనిపై స్పందించిన సర్పంచ్ త్వరలోనే మోటార్ ఏర్పాటు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ సెక్రటరీ, గ్రామ పెద్దలు, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# గంగపుత్ర సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



ఇది కద నిజం, సికింద్రాబాద్ : గంగాపుత్ర సంఘం, గంగాపుత్ర సొసైటీల ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండరు ను సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ బుధవారం సితాఫలమండీ ఎం.ఎల్.ఏ. క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలా కాలంగా తాము గంగపుత్ర సంఘం కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులూ రాజ లింగం, పాక గలేష, అశోక్, వై.మల్లేష్, శ్రీకాంత్, శ్యాం, కంది నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గంజి అర్వింద్ పదవి విరమణ.. ఘనంగా వీడ్కోలు కార్యక్రమం




ఇది కద నిజం: ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్ ఎద్దుమైలారం లో గత 35 ఏళ్లుగా నిర్విరామంగా సేవలందించి బుధవారం నాడు గంజి అర్వింద్ అధికారికంగా పదవి విరమణ చేశారు. ఈ నేపథ్యంలో ఆయనకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.తోటి ఉద్యోగులు పూల బోకేలు, శాలువాలతో ఆయనను ఘనంగా సత్కారించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా గంజి అర్వింద్ తనతో పనిచేసిన ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడుతూ, కొత్తగా చేరిన సిబ్బంది సాంకేతిక నైపుణ్యాలను నేర్చుకుని కంపెనీని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. 35 ఏళ్లుగా సంస్థలో కృషి చేసిన తర్వాత వదిలి వెళ్ళడం తనకు కాస్త బరువుగా అనిపిస్తుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మహేంద్ర్, విగ్నేష్, అఖిల్, వంశీకృష్ణ, శేఖర్, నరేంద్ర, శివ, థరుణ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థిని దుర్మరణం



ఇది కద నిజం, రంగారెడ్డి జిల్లా: పరీక్షలు రాసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ముగ్గురు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వీరిలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా మిగిలిన ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బ్రిలియంట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్న గణేశ్‌తో కలిసి బండల హంసలేఖ (22), దీప్తి అనే ఇద్దరు విద్యార్థులు పిగ్లీపూర్ గ్రామంలోని అన్నమాచార్య కళాశాలలో పరీక్ష రాసేందుకు బైక్‌పై వెళ్తున్నారు. బ్రిలియంట్ కమాన్ నుంచి ముకుంద డెయిరీ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో హంసలేఖ, దీప్తి కిందపడగా, ఇదే సమయంలో వెనక నుంచి వచ్చిన లారీ వెనుక చక్రాల కింద పడిన హంసలేక అక్కడికక్కడే చనిపోయింది. దీప్తికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. గణేశ్‌కు సైతం గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

# స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో గజ మహారాజుకు ప్రత్యేక పూజలు





ఇది కద నిజం: బుధవారం ఉదయం 10 గంటలకు స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో గజ మహారాజుకు ఆలయ అర్చకులు మరియు ఆలయ వ్యవస్థాపకుల సమక్షంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజ ముగిసిన తర్వాత, గజరాజును ఆలయ ప్రాంగణం నుండి మాడవీధుల్లో ఊరేగిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వేడుకకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై, గజరాజును దర్శించడం ద్వారా ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.

# ఇది ప్రజాస్వామ్యంపై దాడి

## సంగయ్య స్వామి ఘటనపై శుభప్రద్ పటేల్ తీవ్ర ఆగ్రహం

● సంగయ్య స్వామిపై దాడి హేయమైన చర్య - శుభప్రద్ పటేల్
● వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలి ● దాడికి పాల్పడిన వారిని చట్టం ప్రకారం కఠినంగా శిక్షించాలి ● ఎన్నికల్లో ఓటమి సహజం, కానీ హింస, భౌతిక దాడికి రాజకీయాల్లో చోటు లేదు



ఇది కద నిజం, వికారాబాద్: కోట్ పల్లి సర్పంచ్ భర్త సంగయ్య స్వామిపై దాడి హేయమైన చర్య అని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శుభప్రద్ పటేల్ అన్నారు. హైదరాబాద్ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంగయ్య స్వామిని ఆయన పరామర్శించారు. సంగయ్య స్వామి ఆరోగ్య పరిస్థితి పై అక్కడి వైద్యులతో అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అలాగే సంగయ్య స్వామి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం భార్య బసమ్మ, కొడుకు రాజశేఖర్ ను కలిసి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా శుభప్రద్ పటేల్ మాట్లాడుతూ.. సర్పంచ్ భర్తపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. ప్రజాస్వామ్యం లో ఇలాంటి దాడులకు తావు లేదన్నారు. సంగయ్య ఆర్థిక పరిస్థితి బాగాలేదని.. ఆయన వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలని శుభప్రద్ పటేల్ ప్రధానంగా డిమాండ్ చేశారు. రాజకీయాల్లో గెలుపు ఓటమలు సహజమన్నారు. ఎన్నికల్లో ప్రజాతీర్పును ఎదుర్కోలేక భౌతిక దాడులు,హత్యా రాజకీయాలకు తెగబడడం సిగ్గుచేటన్నారు. రాజకీయాలలో వాదాలు, సంవాదాలు ఉండాలి కానీ కక్షలు, దాడులు ఉండకూడదని అన్నారు. ఇది తెలంగాణ సంస్కృతికి పూర్తిగా వ్యతిరేకమైనటువంటి పెడధోరణి అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన బాధ్యులను చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సంగయ్య స్వామి త్వరగా కోలుకోవాలని శుభప్రద్ పటేల్ ఆశాభావం వ్యక్తం చేశారు..

## పేదలకు వైద్య సేవలకు ప్రాముఖ్యత

: మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్



ఇది కద నిజం,సికింద్రాబాద్ : నిరుపేదలకు వైద్య సేవలకు అధిక ప్రాముఖ్యతను కల్పిస్తామని, విద్య, వైద్య రంగాలను పేదలకు చేరువలో నిలుపుతామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. సితాఫలమండీ కి చెందిన శాశికళ తీవ్ర అస్వస్థతకు గురై ఎం.ఎల్.ఏ. క్యాంపు కార్యాలయాన్ని ఆశ్రయించడంతో ఆమెను ఆదుకొనేందుకు, వైద్య సేవలకు వీలుగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఎల్.ఓ.సీ. పత్రాన్ని సమకూర్చి అందించారు. సితాఫలమండీ లోని ఎం.ఎల్.ఏ. క్యాంపు కార్యాలయంలో ఆమె కుటుంబ సభ్యులకు బుధవారం రూ. రెండు లక్షల ఎల్.ఓ. సీ. పత్రాన్ని స్థానిక నేతల సమక్షంలో అందించారు.

## ఎం.ఎల్.ఏ. ను కలిసిన నూతన డిప్యూటీ కమీషనర్



ఇది కద నిజం, సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో కొత్తగా ఆవిర్భవించిన జీ.హెచ్.ఎం.సీ. తార్నాక సర్కిల్ కు ఉప కమీషనర్ గా పదవీ భాధ్యతలు స్వీకరించిన శ్రీమతి ఎం.ఎం.ఆర్. జ్యోతి సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. జీ.హెచ్.ఎం.సీ. కార్యకలాపాలు ప్రజలకు సన్నిహితం చేసేలా కృషి చేయాలనీ పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా సూచించారు.

## నూతన సంవత్సర క్యాలెండరును ఆవిష్కరించిన పద్మారావు గౌడ్



ఇది కద నిజం: తెలంగాణ ఉద్యమకారుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి మల్లూరి అనీల్ కుమార్ నేతృత్వంలో ఉద్యమకారులు సితఫలమండీ లోని ఎం.ఎల్.ఏ, కార్యాలయంలో సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ ను బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మల్లూరి అనిల్ కుమార్ తదితరుల ద్వారా నూతన సంవత్సర డిజిటల్ క్యాలెండరు ను పద్మారావు గౌడ్ ఆవిష్కరించారు

## అనిరుధ్ రెడ్డి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి



ఇది కద నిజం,జడ్చర్ల: బుధవారం జడ్చర్ల శాసనసభ్యుడు జనంపల్లి అనిరుధ్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఆర్ & బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా పాల్గొని ఎమ్మెల్యేకి మిఠాయితో ఆప్యాయంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ, తన పుట్టినరోజును రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో జరుపుకోవడం ఎంతో సంతోషాన్ని నింపిందని, అందరి ఆశీస్సులు, శుభాకాంక్షలు ఆయన జీవితంలో ఒక ప్రత్యేక గుర్తుగా ఉంటాయని తెలిపారు.



## ‘టాక్సిక్’లో నయనతార..

యశ్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతూమోహన్ దాస్ ‘టాక్సిక్’ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ‘ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్’ అనేది ట్యాగ్ లైన్. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో నయనతార లుక్‌ను టీమ్ రిలీజ్ చేసింది. ఇందులో ఆమె గంగ అనే పాత్రలో కనిపించనున్నారు. ఈ విషయాన్ని తెలుపుతూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను పంచుకున్నారు. మోడ్రన్ డ్రెస్‌లో గన్ పట్టుకొని పవర్‌ఫుల్ లుక్స్‌తో నయన్ కనిపించారు.ఈ చిత్రంలో ముగ్గురు హీరోయిన్‌లు ఉన్నట్లు మొదటినుంచి వార్తలు వస్తున్నాయి. వాటిని నిజం చేస్తూ చిత్రబృందం ముగ్గురు హీరోయిన్ల లుక్‌లను వరుసగా విడుదల చేసింది. కియారా ఆడ్వాణీ నదియా పాత్రలో కనిపించనుండగా హ్యూమా ఖురేషీ ఎలిజబెత్ పాత్రలో అలరించనున్నారు. చిన్నారుల కోసం ఎన్నో కథలు తెరకెక్కాయని, ఇది పెద్దలకు సందేశమిచ్చే చిత్రమని యశ్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఆయన 19వ చిత్రంగా ‘టాక్సిక్’ తెరకెక్కుతోంది. వచ్చే ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకురానుంది. ‘కేజీయఫ్’ తర్వాత యశ్ నటిస్తున్న సినిమా కావడంతో దీనిపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.

## జ్ఞాపకాలే మిగిలాయి.. వైష్ణవి ఎమోషనల్ పోస్ట్



‘బేబి’ సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌డమ్ తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ వైష్ణవి చైతన్య, తాజాగా తన సోషల్ మీడియాలో చేసిన ఒక పోస్ట్ నెటిజన్లను ఆకట్టుకుంటోంది. ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య కాంబినేషన్ లో వస్తున్న లేటెస్ట్ మూవీ ‘ఎపిక్’. ‘90ం బయోపిక్’ సిరీస్‌తో తన మార్క్ చూపించిన డైరెక్టర్ ఆదిత్య హాసన్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ తాజాగా పూర్తయిన సందర్భంగా, వైష్ణవి కొన్ని ఫోటోలను షేర్ చేస్తూ ఎమోషనల్ అయ్యింది. సెట్‌లో గడిపిన క్షణాలు, టీమ్ అందరితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఈ సినిమా ప్రయాణం తనకు చాలా ప్రత్యేకమని చెప్పుకొచ్చింది.“ఈ సినిమాలో పని చేసిన ప్రతి నిమిషాన్ని నేను ఎంతో ఎంజాయ్ చేశాను. షూటింగ్ సమయంలో చిత్ర బృందం అంతా నాకు ఒక కుటుంబంలా మారిపోయారు. ఇంత మంచి ప్రాజెక్ట్‌లో భాగమైనందుకు చాలా సంతోషంగా ఉంది” అంటూ వైష్ణవి తన మనసులోని మాటను పంచుకుంది. ‘బేబి’ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత ఆనంద్ దేవరకొండ వైష్ణవి మళ్లీ కలిసి నటిస్తుండటంతో ఈ ‘ఎపిక్’ మూవీ పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది.